క్లుప్తంగా

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌ను కలిసిన క్రీడాకారులు



శివసేనారెడ్డిని అభినందిస్తున్న క్రీడాకారులు

బోనకల్: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని శనివారం బోనకల్ మండలానికి చెందిన బ్యాడ్మింటన్ అంతర్జాతీయ క్రీడాకారులు భుక్యా ఉమ, ప్రియాంక, అజ్గర్ తదితరులు ఆదివారం హైద్రాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. సమస్యలు విన్న చైర్మన్ శివసేనారెడ్డి సానుకూలతగా స్పందించారని క్రీడాకారులు తెలిపారు.

నేడు వైద్య శిబిరాలు

సత్తుపల్లిరూరల్: సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచన మేరకు సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 9.30 గంటల నుంచి కిష్టారం అంబేద్కర్ నగర్, ఎన్టీఆర్ నగర్‌లో, మధ్యాహ్నం 2 గంటల నుంచి చెరుకుపల్లి, రేజర్లలో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాలలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రైవేట్‌లో రెండో శనివారం సెలవు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: రాష్ట్రంలో రెండో శనివారం సెలవు దినం ప్రైవేట్ బడుల్లో అమలు చేసేందుకు విద్యాశాఖ అధికారులు బ్యాధత వహించాలని ప్రైవేట్ టీచర్ల ఫోరం డివిజన్ అధ్యక్షుడు మల్లేలి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఎంఈఓ బి.రాములుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు మురళీ, గోపాలరావు, మారేష్, సర్వేశ్వరరావు ఉన్నారు.

అన్నదానం..

మధిర: అన్నం పరబ్రహ్మ స్వరూపమని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్ రావు అన్నారు. వర్తకసంఘంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిరుపేదలకు అన్నదానం చేశారు. విజయ్‌కుమార్, నాళ్ల కోటేశ్వరరావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అదేవిధంగా బంజారా కాలనీలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చీదరాల సత్యనారాయణ, చలువాది కృష్ణమూర్తి, ఆవుల కృష్ణమూరి, వేముల ఆంజనేయులు, వెచ్చా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల పాదయాత్ర

తల్లాడ: మండలంలోని నూతనకల్ గ్రామం నుంచి అంజనాపురం ఆంజనేయ స్వామి దేవాలయం వరకు శనివారం హనుమాన్ భక్తులు పాదయాత్రగా వెళ్లారు. నూతనకల్‌కు చెందిన 15 మంది సభ్యులు 21 రోజులు హనుమాన్ చాలీసా రామాలయంలో భక్తి శ్రద్ధలతో నేర్చుకున్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బోనకల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని రావినూతల వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం.. మండలపరిధిలోని రాపల్లి గ్రామానికి చెందిన పుల్లయ్య తహసీల్దార్ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి విధులు నిర్వర్తించేందుకు బైక్‌పై వస్తున్న పుల్లయ్య గ్రామం వద్ద రోడ్డుపై జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో పుల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని స్థానికులు 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పరామర్శ..



పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

మధిరరూరల్: మండల పరిధిలోని మల్లవరం సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి మందడపు రామారావు కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా శనివారం పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి పరామర్శించారు. సీపీఐ నాయకులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, మడుపల్లి లక్ష్మణ్, చావా మురళీకృష్ణ, సట్టు అశోక్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

- ముందుగానే బోర్ల కింద నార్లు..
- చెరువులకు చేరుకున్న వర్షపునీరు
- కూలీల కొరత, పెరిగిన ఖర్చులతో ఇక్కట్లు..



16 అడుగులకు చేరుకున్న బేతుపల్లి పెద్దచెరువు



సత్తుపల్లి మండలంలో నాట్లు వేస్తున్న కూలీలు

సత్తుపల్లిరూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాలలో వరినాట్లు ఊపందుకున్నాయి. ముందుగా రైతులు బోర్ల కింద నార్లు పోసుకొని ఉండటంతో వర్షాలు పడే సమయానికి నార్ల చేతికందటంతో ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నాట్లు వేసేందుకు కూలీలు ఆటోలలో వెళ్తుండగా.. పొలంగట్లపై కూలీలతో సందడిగా మారింది. మండలంలోని బేతుపల్లి పెద్దచెరువు, కాకర్లపల్లి, తుంబూరు, కిష్టారం, రేజర్ల, సదాశివునిపేట చెరువుల్లో వర్షాలకు వరదనీరు చేరుకున్నాయి. బేతుపల్లి పెద్దచెరువు కింద అధికారికంగా ఆరువేల ఎకరాలు, అనాధికారికంగా 4 వేల ఎకరాలకు నీరు అందుతుంది. బేతుపల్లి పెద్దచెరువు నీటిమట్టం 17 అడుగులకు గాను 16 అడుగుల వరకు చేరుకుంది. సత్తుపల్లి మండలంలో ముందుగా నాట్లు మొదలు పెట్టడంతో 18వేల ఎకరాలకు గాను ఇప్పటికే 12వేల నుంచి 14వేల ఎకరాల వరకు నాట్లు పడుతున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

బయటనుంచి కూలీలు..

వర్షాలు పడుతుండటంతో వరి నాట్లు వేసే సమయం రావటంతో ఒక్కసారిగా కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాట్లు వేసేందుకు ఇతర రాష్ట్రాలైన బెంగాల్, ఒరిస్సా, ఇతర రాష్ట్రాల నుంచి కూలీలకు సత్తుపల్లి ప్రాంతానికి తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన ఖర్చులు..

ఖరీఫ్ వరిసాగు రైతులకు భారంగా మారింది. ఒక పక్క కూలీల కొరత ఖర్చు పెరుగుతుంటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాక్టర్‌తో ఎకరం వరి పొలం సాలు, దుక్కి, దమ్ము చేసేందుకు రూ.5,800 వరకు ఖర్చు అవుతుండగా ఎకరం వరినాట్లు వేయాలంటే రూ.4,600, కలుపు మందుకు రూ.700, ఎరువులు (డీఏపీ, యూరియా) కొనుగోలు, చల్లేందుకు కూలీలతో కలిపి కట్టకు రూ.950ల వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలుపుతున్నారు.



లింగాలలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలో ఖరీఫ్ సీజన్ వరినాట్లు ప్రారంభమయ్యాయి. వాగులు, విద్యుత్ మోటార్లు, వ్యవసాయ పంపు సెట్లు, బోర్లు ఉన్న ప్రాంతాల్లో ప్రారంభించారు. కల్లూరు మండలంలో వ్యవసాయ పంప్‌సెట్లు, విద్యుత్ మోటార్ల ఆధారంగా సుమారు 4,600 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. చెరువు, కాల్వలు, లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టు కింద మరో 28 వేల ఎకరాలు వరి పంట సాగు చేస్తున్నారు. చెరువులు నిండి నాగార్జున సాగర్ కాల్వతో నీటి విడుదల అనంతరం పూర్తిస్థాయిలో మరో 28 వేల ఎకరాలు నాట్లు వేయనున్నారు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమైనందున కరివేద పద్ధతిలో సుమారు 9 వేల ఎకరాల్లో వరి విత్తనాలు చల్లారు. ప్రస్తుతం చిన్న కోరుకొండి, పెద్దకోరుకొండి, ఎర్రబోయినపల్లి, లింగాల, వివిఎస్‌తండా, చండ్రుపట్ల గ్రామాల్లోనే వరినాట్లు ప్రారంభించారు.

జాగ్రత్తలు పాటించాలి..



నారు విషయంలో జాగ్రత్తలు పాటించటంతో లాభసాటిగా ఉంటుంది. నారు పీకడానికి ఏడురోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల నుంచి 200 గ్రాముల కార్బోఫిరన్ 3జీ గుళికల మందు చల్లుకోవాలి. ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున కాలిబాట తీసుకోవాలి. నత్రజని ఎరువును అధికారుల సూచనల మేరకే వినియోగించుకోవాలి.

– వై.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, సత్తుపల్లి

అచ్చంపేట ఆస్పత్రిలాగానే వైరాలో..

- ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



అచ్చంపేట ఆస్పత్రిలో వైద్యుల వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ప్రభుత్వాస్పత్రి నమూనా మాదిరిగానే వైరాలో ఆస్పత్రి నిర్మించాలనే ఉద్దేశ్యంతో అచ్చంపేట ఆస్పత్రిని సందర్శించినట్టు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. ఈ మేరకు అచ్చంపేట ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యేతోపాటు పలువురు నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి డాక్టర్లను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైరాలో ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే వైరాతో పాటు పలు మండలాల ప్రజలు వైద్యం కోసం ఖమ్మం వెళ్లాల్సిన అవసరం రాదన్నారు. ఆస్పత్రిని సందర్శించిన వారిలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంకుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తుల స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న గోకినేపల్లి వెంకటేశ్వరరావు

మధిర: సమస్యల పరిష్కారానికి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి దేశభక్తుల స్ఫూర్తితో యువత ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మధిర పట్టణంలో శనివారం ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ముందుగా సంఘ జెండాను పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె ఎస్ ప్రదీప్ ఆవిష్కరించారు. అమరవీరుల సంతాపాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.అజయ్ ప్రవేశపెట్టగా సభ్యులు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపకుండా మద్యం, మతం, మాదకద్రవ్యాల ఉచ్చులో పాలకులు బిగిస్తున్నారని ఆరోపించారు. పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం.హన్మేష్ మాట్లాడుతూ... గ్రహాంతరాల్లో విహరించే విజ్ఞానం పెంపొందుతున్నప్పటికీ మనుషుల మధ్య మూఢాచారాలు, అశాస్త్రీయ భావాలు అడ్డుగోడలుగా మారాయన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ.. కుల మతాలు లేని సమాజానికి యువత పాటుపడాలని పిలుపునిచ్చారు. నాయకులు పుల్లయ్య, కంకణాల అర్జున్ రావు, ప్రతాప్, రాకేష్, వాసం బుచ్చిరాజు, ప్రేమ్ సింగ్, భరత్, మందా సురేష్, రామకృష్ణ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగుల కోసం పోరాటాలు



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

చింతకాని: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పోరాటాలు నిర్వహించి నిబద్ధత కలిగిన నాయకుడిగా మాదిన్ని రామలింగయ్య పేరు తెచ్చుకున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలపరిధిలోని కొదుమూరు గ్రామంలో మాదిన్ని రామలింగయ్య సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదిన్ని రమేష్, సీపీఎం మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములు కండి



మొక్క నాటి నీరు పోస్తున్న దయానంద్

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. పట్టణంలోని పోస్టాఫీస్‌రోడ్‌లో విశ్వశాంతి విద్యాలయం ఆధ్వర్యాన విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, గాదె చెన్నారావు, కమల్ పాషా, నరుకుళ్ల సత్యనారాయణ, నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి అవినాష్ పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకాలు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని గంగారం శ్రీ విశ్వహరిహర పీఠంలో సిద్ధాంతి శ్రీపెద్దింటి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వారాహి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని పూజలు నిర్వహించారు. తోట గణేష్, దోమ ఆనంద్ పాల్గొన్నారు.

విజయవాడ–భద్రాచలం రోడ్డు రైలు పునరుద్ధరణ



రైలుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కారేపల్లి: కారేపల్లి జంక్షన్ రైల్వేస్టేషన్ మీదుగా విజయవాడ నుంచి భద్రాచలం రోడ్డు వరకు ప్యాసింజర్ రైలును పునరుద్ధరిస్తున్నట్టు రైల్వే అధికారులు శనివారం ప్రకటించారు. కారేపల్లి జంక్షన్ రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు తురక నారాయణతో పాటు, స్థానికులు పలు సందర్భాల్లో రైల్వే అధికారులకు విన్నవించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం కారేపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న విజయవాడ–భద్రాచలం రోడ్డు ప్యాసింజర్ రైలుకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వడ్డె తిరుపతిరావు, బీజేపీ మండలాధ్యక్షుడు మేకల మల్లేష్ యాదవ్, మాన్సింగ్, తురక రవి, పెద్దమ్మ శ్రీకాంత్, తురక రాజా, గంగరబోయిన విక్రం, బాణోతు రాణా, బోళ్ల అశోక్, తురక కోటి, గొడుగు నాగేశ్వరరావు, కేసగాని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీరీల ఊరేగింపు



కారేపల్లి: పీర్లు ఊరేగిస్తున్న ముస్లింలు



తల్లాడలో..


కారేపల్లి: మండలంలోని పేరుపల్లి గ్రామంలో శనివారం తెల్లవారుజాము నుంచి పీర్ల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను గ్రామంలో ఊరేగించారు. ప్రజలు ఇంటి ముందుకు వచ్చిన పీర్లకు జలాభిషేకాలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దట్టీలు, పూలు, మాలీజా సమర్పించుకుంటూ, డప్పు దరువులతో నృత్యాలు చేస్తూ, అసన్, హుస్సేన్‌సాబ్‌ల సవారిని చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెల్లగొర్ల భద్రియాదవ్, షేక్ షరీఫ్‌రంగా, రాషద్‌ఖాన్, మల్లేల నరేష్, అబ్బాస్, అబ్దుల్లా, దుంపటి సతీష్, తుమ్మల శరత్, బోళ్ల మధు, షేక్ నజీర్, రామ్‌నాథ్, శ్రీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో శనివారం మొహర్రం వేడుకల్లో భాగంగా పీరీలను ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా పీర్లను అందంగా అలంకరించి డప్పు, వాయిద్యాలతో ఊరేగించారు.

టీకాలు వేయించాలి

సత్తుపల్లిటౌన్: చిన్నారులకు ఎనిమిది రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించేందుకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యులు అవినాష్ అన్నారు. శనివారం మండలంలోని పలు ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆదాం ఎలీషా

ఎర్రుపాలెం: దళిత క్రైస్తవులకు ప్రభుత్వం ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు పాస్టర్ కోట ఆదామ్ ఎలీషా కోరారు. శనివారం మండలకేంద్రంలోని చర్చిలో నిర్వహించిన ఫాదర్లతో సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చర్చి ఫాదర్లకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. చర్చిల ఫాదర్లు, తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో రహదారులు



కొణిజర్ల: మోకాల్లోతు నీటిని చూపుతున్న కాలనీ వాసులు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురం బీసీ కాలనీలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంతర్గత రహదారి చెరువుగా మారిపోయింది. దీంతో ఆ వీధిలోని వారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని బీసీ కాలనీలో గతంలో ప్రభుత్వ భూమిలో పేదలు ఇళ్లు నిర్మించుకోగా ఈ క్రమంలో కాలనీ చివరి వీధి కావడం, పక్కనే వ్యవసాయ భూములు ఉండటంతో ఆ పొలాల్లోని వరదగా కాలనీలోకే వస్తోంది. దీనికి తోడు పందిళ్ల లక్ష్మీకాంతమ్మ అనే వృద్ధురాలి ఇల్లు లోతట్టులో ఉండటంతో వరద బురదలో జారి పడి లక్ష్మీకాంతమ్మకు కాలుమడమ వద్ద విరిగింది. దీంతో ఆ వీధిలో ఉండేవారు ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి, అధికారులకు చెప్పినా ఏమీ పట్టనట్లు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రామకృష్ణను వివరణ కోరగా పంచాయతీ సిబ్బందిని పంపించి నీరు బయటకు పంపించే ఏర్పాటు చేస్తున్నామన్నారు.

చెరువైన మార్కెట్ గోదాం..

కొణిజర్ల మండలంలోని బస్వాపురంలో నిర్మించిన మార్కెటింగ్ శాఖ గోడౌన్‌లోకి వర్షాలకు పెద్ద మొత్తంలో నీరు చేరి చెరువును తలపిస్తోంది. గ్రామంలోని వరద నీరంతా ఈ గోడౌన్ పక్కనే కల్వర్టు ద్వారా చెరువులోకి చేరుతుంది. అయితే ఇటీవల కొణిజర్ల నుంచి చింతకాని మండలం నేరడ వరకు కొత్త బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి రోడ్డు ఎత్తు పెంచడంతో పాటు గోడౌన్ వద్ద కొత్తగా కల్వర్టు నిర్మాణం చేపట్టారు. దీంతో నీరు కల్వర్టులోకి పోకుండా మొత్తం గోడౌన్‌లోనే నిలిచిపోయింది.

పత్తిలో నిలిచిన వరద నీరు

తల్లాడ: మండలంలో ప్రధాన రహదారి, పత్తి పైర్లలో వర్షం నీరు నిలిచిపోయింది. తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో ఆర్అండ్‌బీ రోడ్డుపై వరద నీరు నిలిచిపోయి వాగును తలపిస్తోంది. బస్టాండ్‌లో కూడా వరద నీరు నిలిచిపోయి బస్సులు రాకపోకలకు ఇబ్బంది కల్గింది. పరిసర గ్రామాల్లో సాగు చేసిన పత్తి పైర్లలో వర్షం నీరు నిలిచింది. మండలంలోని కొత్త మిట్టపల్లి నుంచి రామానుజవరం గ్రీన్ ఫీల్డ్ రహదారి వరకు ఆర్అండ్‌బీ రోడ్డు వాహనాల రాకపోకలు, వర్షం కారణంగా బాగా దెబ్బతింది.



తల్లాడ: పత్తి పైరులో నిలిచిన వరద నీరు



కొణిజర్ల: చెరువును తలపిస్తున్న గోడౌన్ యార్డ్

వేధిస్తున్న వైద్యుల కొరత..!

- పల్లె దవాఖానాల్లో అందని వైద్యం
- డిప్యూటేషన్లతో వెత
- పట్టించుకోని అధికారులు



వెంకటాపురంలో ఆరోగ్య ఉప కేంద్ర భవనం

ముదిగొండ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరిచిన పల్లె దవాఖానాల్లో తరచూ వైద్యుల కొరత వేధిస్తోంది. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆశయం మంచిదైనా ఆయా దవాఖానాల్లో సేవలు అందించేందుకు అర్హత కలిగిన వైద్యులు లేకపోవడంతో రోగులు అయోమయంలో ఉన్నారు. కొన్నిచోట్ల అర్హత ఉన్న వైద్యులను నియమించినా వారిని ఇతర పీహెచ్‌సీలకు డిప్యూటేషన్‌పై పంపడంతో ఆయా ఆస్పత్రుల్లో కేవలం శిక్షణ పొందిన ఎంఎల్‌హెచ్‌పీలు మాత్రమే సేవలందిస్తున్నారు. మండలంతో పాటు, మధిర నియోజకవర్గంలోని పల్లె దవాఖానాల పరిస్థితి గందరగోళంగా ఉంది.

ముదిగొండ మండలంలో ముదిగొండ, వల్లభిలో తొమ్మిది సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా ప్రభుత్వం ప్రకటించింది. మేడేపల్లి, వెంకటాపురం, ముదిగొండ పల్లె దవాఖానాల్లో కనీసం ఎంఎల్‌హెచ్‌పీలు కూడా లేరు. మిగిలిన కమలాపురం, వనంవారికిష్టాపురం, పెద్దమండవ, గంధసిరి, మాధాపురం, పమ్మిలలోని ఆరు చోట్ల ఎంఎల్‌హెచ్‌పీలు వైద్య సేవలు అందిస్తున్నారు. చింతకాని మండలంలో పది ఆరోగ్య ఉపకేంద్రాల్లో వైద్యులు తరచూ మారుతున్నారు. బోనకల్ మండలంలో పల్లె దవాఖానాలు ఆరు ఉన్నాయి. వీటిలో రెండు కేంద్రాల్లో ఎంబీబీఎస్, ఒక చోట ఆయుష్ వైద్యుడు పనిచేస్తుండగా మూడు చోట్ల వైద్యులు లేరు. ఎర్రుపాలెం మండలంలో తొమ్మిది దవాఖానాలుండగా వాటి ఒకటి మాత్రమే సేవలకు దూరంగా ఉంది. మిగతావన్నీ సజావుగా సేవలు కొనసాగుతున్నాయి. మధిర మండలంలో కొందరు వైద్యులు వేరే ఆస్పత్రులకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. నిదానపురంలో పల్లె దవాఖానా మంజూరైనా సౌకర్యాలు లేక ప్రారంభించలేదు. ప్రజలకు అక్కడ సేవలు అందడం లేదు.

ఎంఎల్‌హెచ్‌పీలతో వైద్య సేవలు..



మాదాపురం, పమ్మిలో పల్లెదవాఖానా కేంద్రాల్లో శిక్షణ ఎంఎల్‌హెచ్‌పీలతో రోగులకు సేవలు అందుతున్నాయి. వెంకటాపురం, మేడేపల్లి, ముదిగొండలోని ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చి సేవలు అందించేందకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్కడ ఏఎన్‌ఎంలు చూస్తున్నారు.

– ఊరుకొండ అరుణదేవి, ముదిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారిణి

పల్లె దవాఖానాలుగా మార్చి సేవలు



ముదిగొండ మండలంలోని కమలాపురం, వనంవారికిష్టాపురం, పెద్దమండవ, గంధసిరిలలో పల్లె దవాఖానాలుగా మార్చి వైద్య సేవలు అందిస్తున్నాం.. వాటిలో శిక్షణ ఎంఎల్‌హెచ్‌పీలతో రోగులకు సేవలు అందుతున్నాయి. మందులు కొరత కూడా లేదు. మూడు నెలల నుంచి కొరత ఉంది. ఇండెంట్ పెట్టాం. అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి.

– ధర్మేందర్, పీహెచ్‌సీ వైద్యుడు, వల్లభి